www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 12 మార్చి 2024
5
అన్నమయ్య



సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదు : జెసి


సమస్యలు తెలుసుకుంటున్న జెసి

ప్రజాశక్తి - రాయచోటి : జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో అందిన ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపకుండా అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం అందించాలని జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జెసి, డిఆర్‌ఒ సత్యనారాయణ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోపు అర్జీదారుడు సంతృప్తిచెందేలా అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు,బియాండ్ ఎస్-ఎల్‌ఎ, రీఓపెనింగ్ లేకుండా సంతృప్తి స్థాయి పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా వైద్యులు, వైద్య విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో సిఎం జగన్

అభివృద్ధికి నిదర్శనం.. పులివెందుల



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సిఎం జగన్

రూ.861.84 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం
అందుబాటులోకి రూ.500 కోట్ల ప్రభుత్వ వైద్య కళాశాల
పులివెందులలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బిజీబిజీ

ప్రజాశక్తి-పులివెందుల టౌన్/రూరల్/వేంపల్లె/కడప

పులివెందుల అభివృద్ధి రాష్ట్రానికే ఆదర్శనీయమని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన ఒక్కరోజు జిల్లా పర్యటనలో భాగంగా పులివెందులలో రూ.861.84 కోట్లతో నిర్మించిన పది రకాల అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి జిల్లా ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజు తన సొంత గడ్డపై ముఖ్యమంత్రిగా మీ అందరి ముందు నిలుచున్నానంటే మీ అందరి అభిమానం, ఆశీస్సులు, దేవెనెలేనన్నారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పులివెందులలో ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరుగుతోందన్నారు. పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి అనేది అనంతం అని, కాలానుగుణంగా అభివృద్ధి కొనసాగుతూనే ఉంటుందని తెలిపారు. సొంత గడ్డపై మమకారం ఎప్పటికీ తీసిపోయేది కాదన్నారు. పులివెందుల అభివృద్ధి ఫలాలను ప్రజలకు చేరడంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఐదు సంవత్సరాల నుంచి చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. ప్రతి ఒక్క అధికారి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక పర్యవేక్షణ పెట్టి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. ఇందుకోసం ప్రత్యేకమైన ప్రణాళికలు, అధికారులతో పర్యవేక్షణ ఉండాలన్నారు.

రూ.861.84 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం


మినీ సెక్రటేరియట్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి

పులివెందులలో రూ.861.84 కోట్లతో నిర్మించిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. మొదటగా కడప రోడ్డులో నాబార్డు, ఆర్‌ఐడిఎఫ్ సంయుక్తంగా రూ.500 కోట్లతో 50 ఎకరాల్లో నిర్మించిన 627 పడకలు కలిగిన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వైఎస్ఆర్ ప్రభుత్వ వైద్యకళాశాల, నర్సింగ్ కళాశాలలు, రూ.70 లక్షలతో వైఎస్ఆర్ జంక్షన్‌లను ప్రారంభించారు. నల్లపురెడ్డిపల్లిలో ప్రభుత్వ, పాడా సంయుక్తంగా ఇదెకరాల్లో రూ.20 కోట్లతో నిర్మించిన ఇంటెగ్రేటెడ్ అరటి ప్యాక్‌హౌస్, రూ.38.15 లక్షలతో కూడిన వైఎస్ఆర్ మినీసెక్రటేరియట్ భవనాలను, మోడల్ టౌన్ ప్రాజెక్టులో భాగంగా పులివెందుల మెయిన్‌రోడ్డులో రూ.11.4 కోట్లతో నిర్మించిన సెంట్రల్‌బోలే వార్డును ప్రారంభించారు. బైపాస్ రోడ్డులో రూ.20.69 కోట్లతో నిర్మించిన వైఎస్.జయమ్మ, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను, రూ.80 లక్షల ప్రభుత్వ నిధులతో నిర్మించిన గాంధీ జంక్షన్, పులివెందుల పట్టణ సమీపంలో 100 ఎకరాల్లో రూ.65.99 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్‌ను ప్రజలకు చేరువ చేశారు. అనంతరం ఇండస్ట్రియల్ పార్కులో రూ.175 కోట్లతో నిర్మించిన ఆధిత్యబిర్లా అనే ప్రయివేటు సంస్థ నిర్మించిన పేస్-1 యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం ఇడుపులపాయకు చేరుకుని రూ.39.13 కోట్ల ప్రభుత్వ, పాడా నిధులతో నిర్మించిన వైఎస్ఆర్ మెమోరియల్ పార్కును ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలం సురేష్, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఎం.టి.కృష్ణబాబు, కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, కలెక్టర్ వి.విజయ్ రామరాజు, జెసి గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డిఒ వెంకటేష్, శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ ఎస్ .సతీష్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్.మనోహర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యాడ్ ఛైర్మన్ చిన్నప్ప, వివిధ శాఖల అధికారులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు. సిఎం పర్యటన సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. అనంతరం కడప ఎయిర్‌పోర్టు నుంచి తాడేపల్లికి బయల్దేరివెళ్లారు.


బనానా ప్యాక్ హౌస్‌ను పరిశీలిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి


ప్రభుత్వాస్పత్రిలోని స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సిఎం


నర్సింగ్ కళాశాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి జగన్

ఎన్నికల బాండ్లను బహిరంగపరచాలి

ఎస్‌బిఐ ఎదుట ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు



మదనపల్లె : ఎస్‌బిఐ ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లి

ఎన్నికల బాండ్లను బహిరంగపరచి నిజా నిజాలు ప్రజలకు తెలపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలను వెల్లడించకుండా కుట్ర చేస్తున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఎస్‌బిఐ వైఖరిని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మదనపల్లె స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన బ్యాంచి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, ఆ సమాచారం అందజేయాలని దేశ అత్యున్నత న్యాయవ్యవస్థ సుప్రీం కోర్టు ఆదేశించడం జరిగిందన్నారు. దేశంలో అత్యున్నతమైన, అతి పెద్ద డిజిటలైజేషన్ కలిగిన, దాదాపు 48 కోట్ల ఖాతాలు కలిగిన ప్రభుత్వ రంగ సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కానీ మాకు జూన్ 30 వరకు గడువు కావాలంటూ దరఖాస్తు చేయటం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఎలాంటి విమర్శలు రాకుండా కాపాడేందుకు ఎస్‌బిఐ ఒక కవచంలా వ్యవహరిస్తుడం సరైనది కాదన్నారు. అతి పెద్ద డిజిటలైజేషన్ కలిగిన సంస్థ ఎస్బిఐ అని రాతపూర్వ కంగా భద్రపరిచామని సాకు చూపించి గడువు కోరటం హాస్యాస్పదమని పేర్కొన్నారు. బాండ్లు ఇచ్చిన వారికి పుచ్చుకున్న వారికి మధ్య క్విడ్ ప్రోకో అనే బాగోతం నడిచిందని కొన్నిసార్లు కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరించటానికి ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చే విధంగా ఈ బాండ్ల ఉన్నాయని సుప్రీంకోర్టు తీర్పు కనుగుణంగా బాండ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు హరిశర్మ, సాహిన, ఉషారాణి, వెంకటలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ :ఎన్నికల బాండ్లపై సుప్రీం కోర్టు ఆదేశాలు ఎస్‌బిఐ ఎన్నికల ముందే అమలు చేయాలని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌బిఐ కాలనీలోని మెయిన్ బ్రాంచ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్నికల బాండ్ల లావాదేవీలపై మార్చి 13వ తేదీ లోపు సుప్రీం కోర్టుకు ఎస్‌బిఐ అన్ని బ్రాంచ్‌లు తెలియజేయాలని, పార్లమెంటు ఎన్నికల బాండ్ల చట్టం చల్లదని, ఈ చట్టం పౌరుల ప్రాథమిక హక్కులను హరించే విధంగా ఉందని, భారతదేశ రాజ్యాంగం పార్లమెంట్ ప్రాబల్యం కలిగినది కాదని, ప్రజాహిత, ప్రజాస్వామ్య ప్రాబల్యం కలిగినదని వ్యాఖ్యానిస్తూ ఇచ్చిన తీర్పు ఆదేశాలకు, బిజెపి ఒత్తిడితో లోక్ సభ ఎన్నికల తర్వాత ఎస్‌బిఐ. ఎన్నికల బాండ్ల వివరాలు, లావాదేవీలు, పేర్లు, ఇస్తామనడం అహేతుకమైన విషయమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఎన్నికల ఎలక్ట్రోరల్ బాండ్స్ చట్టాన్ని కొట్టివేస్తూ, 21 రోజు లోపల 2019 నుండి 2024 వరకు ఎన్నికల బాండ్ల వివరాలు, లావాదేవీలు, ఇచ్చినవారు, పుచ్చుకున్న వారి వివరాలు, సుప్రీం కోర్టుకు 2024 మార్చి 13వ తేదీ లోపు తెలియజేయాలని సుప్రీం కోర్టు ఆదేశించినప్పటికీ, బిజెపి ఒత్తిడితో ఎస్‌బిఐ నేటి నుండి మళ్లీ 116 రోజులు గడువు కావాలని సుప్రీం కోర్టులో అఫిడవిట్ వేసిందన్నారు. 2024 ఏప్రిల్ ఎన్నికలు ముందు వివరాలు ఇవ్వడానికి సిద్ధంగా లేనట్లుగాను, ఎన్నికల బాండ్ల వాస్తవాలు, నిజాలు దేశ ప్రజలకు తెలియజేయకుండా ఆపటానికి బిజెపి కేంద్ర ప్రభుత్వంలోని ఎస్‌బిఐ రాజ్యాంగ సంస్థను ప్రభావితం చేస్తున్నట్లుగానూ తేటతెల్లమవుతోందని విమర్శించారు. నాలు గు నెలల కిందట బిజెపికి ఎప్పుడు ఎన్నికల విరాళాలు ఇవ్వని 23 కార్పొరేట్ సంస్థలు రూ.9.05 కోట్లు విరాళాలు ఇచ్చాయని చెప్పారని వారి పేర్లు వెల్లడించడానికి సమయం కోరడం హాస్యా స్పందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఎం సభ్యులు వెంకటయ్య మాధవయ్య విశ్వనాథరెడ్డి మురళి నాగయ్య పాల్గొన్నారు.

రాజంపేట అర్బన్ : ఎన్నికల బాండ్లను బహిరంగపరచి నిజానిజాలు ప్రజలకు తెలపాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, సి.హెచ్.చంద్రశేఖం డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్‌బిఐ బ్యాంకు వద్ద సిపిఎం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2019లో ఎన్నికల బాండ్లను, స్కీమును ప్రవేశపెట్టిందని. అవినీతిని చట్టబద్ధం చేయడమే దీని పని అని, దీన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకించిందని తెలిపారు. సుప్రీం కోర్టు కూడా ఏకపక్షంగా చేసిన నిర్ణయం రద్దు చేయాలని ఆదేశించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పందికాళ్ళ మణి, నాయకులు నాయకులు, సి.హరి ప్రసాద్, షేక్. భూరాన్ పాల్గొన్నారు.


రాజంపేట్ల : ఎస్‌బిఐ ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు


రాయచోటి : ఎస్‌బిఐ ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు


గర్భిణులకు సూచనలు ఇస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

ప్రణాళిక అనుసరిస్తే తల్లీబిడ్డా క్షేమం : డాక్టర్

ప్రజాశక్తి-పీలేరు

గర్భిణులు క్రమం తప్పక వైద్య పరీక్షలు చేసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ, తల్లి క్షేమంగా ఉంటారని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ గర్భిణీ స్త్రీలకు విజ్ఞప్తి చేశారు. సోమవారము తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముదుపులవేముల గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని గర్భవతులకు ఆరోగ్య పరీక్షలు, మెళకువలు తెలిపారు. గర్భిణీకాలంలో 10 నుంచి 12 కేజీలు బరువు కనీసం పెరగాలని, అందుకు మంచి జీవనశైలి తోపాటు బలాన్నిచ్చే పౌష్టిక ఆహారం తీసుకోవాలని అది మేలైన ఆరోగ్యానికి సూచికని, మొదటి త్రైమాసికం తర్వాత రోజు ఒక ఐరన్ మాత్ర వంతున ఆరు నెలలు పాటు తీసుకోవాలని, అదేవిధంగా రోజుకు రెండు క్యాల్షియం మాత్రలు కనీసం ఆరు నెలలపాటు, తీసుకుంటూ ఒకడోస్ 400 యం.జి.ఆల్బెండాజోల్ మాత్ర తప్పనిసరి తీసుకోవాలని సూచించారు. ఈ మందులు తల్లి, బిడ్డకు శారీరక, మానసిక, ఆరోగ్యాన్ని ఇస్తాయని గర్భిణులకు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, వసుందర, సిహెచ్ఓ నాగమత్యం, డిఇఒ ధరణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జపాన్‌లో నర్సులకు ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి-రాయచోటి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎఎన్ఎం జి ఎన్ ఎమ్ బి ఎస్ సి నర్సింగ చదివిన వారికి జపనీస్ భాష ఎన్5, ఎన్4, ఎన్3 స్థాయిలలో నేర్పించి, వారికి జపాన్ దేశంలో నర్సులుగా ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి బండ్ల హరికృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు జపాన్ దేశంలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలని, 32 సంవత్సరాలు లోపు వయసు ఉన్న అభ్యర్థుల అర్హులని, శిక్షణ కాలం 6 నెలలు అని, శిక్షణ బెంగళూరులో జరుగుతుంది అని, శిక్షణ ఫీజు రూ.మూడు లక్షలు, పాక్షిక శిక్షణ రుసుం రూ.50 వేలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ రూ.25 వేలు చెల్లిస్తుందని పేర్కొన్నారు. మిగిలిన రూ.25 వేలు అభ్యర్థి చెల్లించాలని తెలిపారు. మిగిలిన రూ.3 లక్షలు మూడు విడతలుగా అభ్యర్థి చెల్లిచాల్సి ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జపాన్ దేశంలో ఉద్యోగ అవకాశం కల్పించటానికి కావాల్సిన సదుపాయాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ పర్యావేక్షితుందని చెప్పారు. ఉద్యోగం పొందిన అభ్యర్థి జీతం రూ.1.10 లక్షల నుండి రూ.1.40 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ వెబ్‌సైట్‌లో https://www.apssdc.in/home/onlineProgramRegistration వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9494133521ను సంప్రదించాలన్నారు.

విద్యాభివృద్ధికి అధిక నిధులు : మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-ఓబులవారిపల్లె (పుల్లంపేట)

దేశంలో ఎక్కడా లేనివిధంగా పేద విద్యార్థుల సంక్షేమానికి అధిక నిధులు ఖర్చు చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఓబులవారిపల్లె మండలం, తల్లెంవారిపల్లె, గ్రామంలో నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వైయస్సార్ రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు ధనుంజయరెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డి, కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరుముట్ల శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ గతంలో ఎప్పుడూ ఎన్నడూ ఎవరూ చేయని విధంగా విద్యాభివృద్ధికి అధిక నిధులు ఖర్చు చేసి పేద విద్యార్థుల సంక్షేమానికి కృషి చేశారని పేర్కొన్నారు. విద్యార్థులు అంటే ఎంతో ఇష్టమని విద్యార్థులకు యూనిఫాం, టై, బెల్టు, బూట్లు, బ్యాగు, పుస్తకాలు, నాణ్యమైన పౌష్టికాహారం ఇస్తూ కన్న తల్లిదండ్రులు కూడా చూసుకోలేని విధంగా జగనన్న విద్యార్థులను ఎంతో ప్రేమతో చూసుకుంటున్నారన్నారు. ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదవాలనే ఉద్దేశంతో జగనన్న విద్యాదీవెన, విద్యాకానుక, విదేశీ విద్య వంటి పథకాలను ప్రవేశపెట్టి పేద విద్యార్థుల సంక్షేమానికి కృషి చేశారన్నారు. గతంలో మేము స్కూల్‌కి వెళ్లాలంటే ఆర్థిక ఇబ్బందులతో ఎంతో కష్టపడేవారమని నేడు ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించారని తెలిపారు. ప్రతి విద్యార్థి చక్కగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలన్నారు. విద్యతోనే సమాజం బాగుపడుతుందన్న మంచి ఉద్దేశంతో ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ ద్వారా 35 లక్షల వరకు పేదల వైద్యానికి ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. ఇలా నిరంతరం ప్రజల సంక్షేమమే తమ ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ముఖ్యమంత్రి సలహాదారులు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండటం వల్ల రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భారతదేశ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా పిల్లల చదువులు తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో విద్య, ఆరోగ్యానికి ఎక్కువ నిధులు ఖర్చు చేశారన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేయాలని ఉద్దేశంతో వాలంటీర్, సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలను పేదల ముంగిటకు తీసుకెళ్లడం జరిగిందన్నారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని తెలిపారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలనే ఉద్దేశంతో పూర్తిస్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను నాడు నేడు కార్యక్రమం ద్వారా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసిందన్నారు. విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా విశాలమైన పాఠశాలల గదులు బెంచీలు, విద్యుత్తు, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్, ఆర్వో ప్లాంట్ వంటి అన్ని వసతులు విద్యార్థులకు ఏర్పాటు చేశామన్నారు. తల్లెంవారిపల్లెలో ముఖ్యమంత్రి సలహాదారులు ధనుంజయరెడ్డి సహకారంతో రూ.2.10 కోట్లతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయడం ప్రతి ఒక్కరు గర్వించదగ్గ విషయమన్నారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్‌పి కృష్ణారావు, ఆర్‌జెడి రాఘవరెడ్డి, ఆర్‌డిఒ మోహన్‌రావు, డిఇఒ శివ ప్రకాష్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, కొల్లం గంగిరెడ్డి, గుంతకల్ రైల్వే బోర్డు మెంబర్ తల్లెం భరత్ కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ సాయి కిషోర్‌రెడ్డి, పుల్లంపేట ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి, ఉపాధ్యాయుడు పొత్తపి నరసింహారెడ్డి పాల్గొన్నారు.


జడ్‌పి పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

అధిష్టానం ఆదేశిస్తే అసెంబ్లీకి పోటీ చేస్తా

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే రాజంపేట నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి పోటీకి సిద్ధంగా ఉన్నట్లు విశ్రాంత పోలీస్ అధికారి అంకిపల్లి చంగయ్య తెలిపారు. సోమవారం ఆర్అండ్‌బి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సేవ చేయాలన్న సంకల్పంతో పిసిసి అధ్యక్షులు షర్మిలను కలిసి విన్నవించినట్లు తెలిపారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, పిసిసి మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, మాజీ మంత్రి వీరారెడ్డి వద్ద గన్‌మెన్‌గా పనిచేయడంతో పాటు రాజంపేట నియోజకవర్గంలో బలమైన బంధుగణం, స్నేహితులు ఉన్నట్లు తెలిపారు. సేవా కార్యక్రమాల ద్వారా నియోజకవర్గ ప్రజలకు తాను సుపరిచితుడనేనని, రానున్న సార్వత్రిక ఎన్నికలలో అధిష్టానం ఆదేశానుసారం పోటీ చేసి అత్యధిక మెజారిటీతో గెలిచి రాజంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తానని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న చెంగయ్య


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రియాజ్ బేగ్

35 ఏళ్లు దాటిన వారికి కంటి పరీక్షలు
- డిపిఎం డాక్టర్ రియాజ్ బేగ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

35 ఏళ్ల నుండి 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరు గ్లకోమా కంటి పరీక్ష చేసుకోవాలి డిపిఎం డాక్టర్ రియాజ్ బేగ్ అన్నారు. సోమవారం ప్రపంచ గ్లకోమా సందర్భంగా ఈనెల 16వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్లకోమ అనేది కంటికి సంబంధించిన వ్యాధి అని కంటి లోపల పీడనం పెరిగి కంటి నరాలు సచ్చు పడి పోయేవిదంగా చేసి ఫలితంగా రాను, రాను కంటి చూపు తగ్గిపోతుందన్నారు. ఈ గ్లాకోమ ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు కనపడక పోయిన ప్రాథమిక దశలో గ్లాకోమ లక్షణాల వల్ల 40 ఏళ్లకుపైబడిన వ్యక్తులు తరచూ అద్దాలు మార్చవలసి రావడం, వెలుతురు చుట్టూ రంగు వలయం ఏర్పడటం, తరచుగా తలనొప్పితో పాటు కంటి ఎరుపు, వాంతులు, కనుగుడ్డు నొప్పి కలిగి ఉండటం, వంటివి ఉంటాయని పేర్కొన్నారు. 35 నుండి 40 ఏళ్లలోపు ప్రతీ ఒక్కరూ ఈ పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. గతంలో కనుగుడ్డుపై ఏదైనా గాయం తగిలిన, స్టెరైడ్ మందులు అధికంగా వాడిన షుగర్, బిపి ఉన్నవారు, రక్త సంబంధీకులలో ఎవరికైనా గ్లాకోమ వ్యాధితో వస్తుందని తెలిపారు. అలాంటి వారు అన్ని సామాజిక, ఏరియా వైద్యశాల ఆసుపత్రులలో ఆప్తమాలజిస్ట్‌ల దగ్గర గ్లాకోమ పరీక్ష చేసుకోవాలని. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ కిరణ్ కుమార్, ఆప్తల్మిక్ అసిస్టెంట్ కల్పన, ప్రజలు పాల్గొన్నారు.

13న ప్రధానమంత్రి సు-రాజ్ వర్చువల్ సమావేశం

ప్రజాశక్తి- రాయచోటి

ఈ నెల 13వ తేదీన భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ సు-రాజ్ వర్చువల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు డాక్టర్ హెచ్ వెంకటసుబ్బయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ సూచనల మేరకు కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆధ్వర్యంలో 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో వర్చువల్ సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కేంద్ర పథకాలైన ఎన్ఎస్ఎఫ్‌డిసి, ఎన్ఎస్ కెఎఫ్‌డిసి, ఎన్‌బిసిఎఫ్‌డిసి, ఎన్ఎంఎఎస్టీ పథకాల లబ్దిదారులతో సు-రాజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఇందులో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో ముఖాముఖిగా లబ్దిదారులతో మాట్లాడతారని పేర్కొన్నారు. ఆయా పథకాల లబ్ధిదారులు అందరూ సకాలంలో హాజరు కవాలని కోరారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్, ఆర్ట్ మాస్టర్ ఆనంద్

గురుకుల విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి-రామాపురం

విజయవాడలో జరిగిన జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీల్లో మండలంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న పది మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ వరప్రసాద్, ఆర్ట్స్ మాస్టర్ ఆనంద్‌బాబులు తెలిపారు. 10న విజయవాడలో డ్రీమ్స్ చిల్డ్రన్స్ ఆర్ట్స్ అకాడమీ అనంత డైమండ్స్ వారు సంయుక్తంగా జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విజయవాడ ఎయిర్‌ఫోర్ట్ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారని అఅన్నరు. ఈ పోటీలలో రెండు వేల మంది విద్యార్థులు పాల్గొనగా, రామపురం గురుకుల పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. వీరిలో పదిమంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

మెరుగైన పారిశుధ్య కల్పనే ధ్యేయం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలో మెరుగైన పారిశుధ్య కల్పనే ధ్యేయమని బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ పిఆర్.మనోహర్ వెల్లడించారు. సోమవారం క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా జ్యోతిచౌక్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల రోడ్డు, దిగువ బస్టాండ్, చెరువు కట్టలపై పారిశుధ్య పనులను పరిశీలించారు. మట్టిని,చెత్తాచెదారాన్ని, పిచ్చి మొక్కలను కార్మికులచే తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నిర్విరామంగా పారిశుధ్య పనులు జరుగుతున్నాయని, ప్రతిరోజూ ఏదో ఒక వార్డులో, క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాల ద్వారా పారిశుధ్య పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇక ఎండ తీవ్రత ఎక్కువగా కానున్న నేపథ్యంలో ప్రజలుకు బస్టాండ్ ప్రాంతంలో చలివేంద్ర ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని, తద్వారా క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగస్వాములు కావాలని అన్నారు. పట్టణంలో ఎక్కడ అపరిశుభ్రత ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.

ప్రధానోపాధ్యాయులుగా సత్యకుమార్

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా సత్యకుమార్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఇక్కడ పనిచేస్తున్న సత్యకుమార్‌ను ఉన్నతాధికారులు హెచ్‌ఎంగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు గంగాదేవి పదవీ విరమణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం, విద్యార్థుల ఉన్నత చదువుల కోసం తమ వంతు సహాయ, సహకారం అందిస్తామని చెప్పారు.

వైభవంగా సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కలకడ: మండలంలోని దేవలంపేటలో శ్రీ కామాక్షి సమేత సిద్ధార్ధ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం త్రిశూల స్థానాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త అఖిలేష్ తెలిపారు.త్రిశూర స్థానం అనంతరం వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాలను భక్తులు భక్తిశ్రద్ధలతో తిలకించి నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమాలను త్రికూటం విజయ సారధి, వేద మంత్రాల మధ్య నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, మల్లికార్జున నాయుడు, కుమార నాయుడు, జనార్ధన్ నాయుడు, రెడ్డి శేఖర్ నాయుడు, రెడ్డప్ప నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

నేడు చౌడసముద్రంలో గడప గడపకూ..

ములకలచెరువు : మండలంలోని చౌడసముద్రంలో మంగళవారం ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డిచే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి సాయిలీల, మండల కన్వీనర్ మాధవరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని మండలస్థాయి, గ్రామస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జిల్లా కార్యవర్గ సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా సభ్యులు, గృహసారథులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.



చరితను అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపల్

జాతీయ స్థాయికి 'జ్ఞానదీప్తి' విద్యార్థి చరిత

ప్రజాశక్తి-నందలూరు

వేదిక్ మాథ్స్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీలలో స్థానిక జ్ఞానదీప్తి పాఠశాల విద్యార్థిని ఆకుల చరిత చాంపియన్‌గా నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది.విజయవాడలో జరిగిన రాష్ట్ర పోటీలలో పాల్గొని రాణించిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ జానకినాథ్, ప్రిన్సిపల్ కమల లక్ష్మి ల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జానకినాథ్ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనగా ఆకుల చరిత ఛాంపియన్‌గా నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణం అని అన్నారు. పోసిన మాన్య పద్మజాలి, గీతశ్రీ, సాయిమాధవ రామకృష్ణాయిలో తమ ప్రతిభను చాటారని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ వహించి వారిలో ఉన్న మేధో సంపత్తిని వెలికి తీసే విధంగా ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థులు ఉన్నత మైన వ్యక్తులుగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి : నిస్సార్ అహ్మద్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మహిళలు ఆర్థికంగా ఎదగడానికి అనేక రకాల సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అక్కచెల్లెమ్మలకు అందిస్తూ అండగా నిలుస్తున్నారని మదనపల్లి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం నిమ్మనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) మైదానంలో నిర్వహించిన వైఎస్‌ఆర్ చేయూత నాలుగవ విడత నిధుల పంపిణీ, జగనన్న ఇంటి బదలాయింపు ఆస్తి పత్రాలపంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మదనపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జింక వెంకటాచలపతి, ఎంపిపి నరసింహులు, వైస్‌ఎంపిపి జయప్రకాశ్‌రెడ్డిలతో కలసి హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్న సంకల్పంతో, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడాలన్న ఉద్దేశంతో, డ్వాక్రా మహిళల కోసం వైఎస్‌ఆర్ ఆసరా 45 నుంచి 60 మధ్య వయసు ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలకు వైఎస్‌ఆర్ చేయూత ద్వారా లబ్ధి చేకూరుస్తూ భరోసా కల్పిస్తున్నారన్నారు. అన్ని పదవులలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. పేదల పిల్లలు చదువుకునేలా ప్రోత్సహిస్తూ ప్రతి తల్లికి అమ్మఒడి ద్వారా మేలు చేస్తున్నారన్నారు. వైయస్సార్ చేయూత నిధులను సద్వినియోగం చేసుకొని, మహిళలు తమ కుటుంబాలను మెరుగైన స్థితిలో నిలుపుకోవాలన్నారు. మహిళలు ఉపాధి, వ్యాపార రంగాలకు ఈ నిధులను అనుసంధానిస్తూ ఆర్థిక అభివృద్ధి సాధిస్తున్నారి అన్నారు. ఇక సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో ప్రతిపక్షాలన్నీ జట్టు కట్టి కూటమిగా ఏర్పడి, అబద్దాల ముసుగులతో ప్రతి గడప తొక్కుతారని విమర్శించారు. అలాంటి వారికి తగిన బుద్ధి చెప్పి వైసిపి ప్రభుత్వంలో మేలు జరిగిన ప్రతి ఒక్కరూ జగన్మోహన్ రెడ్డికి అండగా నిలిచి, మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్రంలోని సంక్షేమ పథకాలు కొనసాగాలన్న మరోవైపు అభివృద్ధి స్థిరంగా జరగాలన్నా వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు తిరిగి తెచ్చుకోవాలని కోరారు. ఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ అమ్మఒడి, వైఎస్‌ఆర్ ఆసరా, వైఎస్‌ఆర్ చేయూత, సున్నా వడ్డీ రుణాలు అందించి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. మహిళల పేరుపై రాష్ట్రంలో 35 లక్షల మందికి ఇంటి పట్టాలు అందజేసి, వారికి సొంతింటి కలను నెరవేర్చారని తెలిపారు. మండలంలోని 2276 మంది సభ్యులకు రూ.4.26 కోట్ల నగదు వారి వ్యక్తిగత ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ సదాశివరెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్‌రెడ్డి, వైసిపి ప్రధాన కార్యదర్శి కొమ్మేపల్లి శ్రీనివాసులురెడ్డి, జెసిఎస్ కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, సర్పంచ్‌లు సుబ్రహ్మణ్యం, చెంద్రాయుడు, మహాదేవ రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్‌రఫీ, సీనియర్ నాయకులు సాయి ప్రతాప్ రెడ్డి, నూర్ మోహిద్‌ఖాన్, చంద్రమోహన్, తహశీల్దార్ బాలాజీరాజు, ఎంపిడిఒ మైథిలి, ఏపిఎం రజనీకుమారి, ఎంపిటిసిలు పాల్గొన్నారు. **కలికిరి:** మహిళా సాధికారత కోసమే మహిళలకు చేయూత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక మండల కేంద్రంలోని ఎంపిపి మెయిన్ స్కూల్‌లో నాలుగో విడత చేయూత చెక్కులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ అత్యధిక శాతం మహిళలకే అన్ని పథకాలు వర్తింపజే విధంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చేశారని మహిళలు ఆర్థికంగా ఎదుగుదల జరిగినప్పుడే కుటుంబ అభివృద్ధి జరుగుతుందని వైసిపి ప్రభుత్వం అన్ని పథకాలను మహిళల పేరుతోనే కేటాయించి నేరుగా లబ్ధిదారుల ఖాతాలో నగదు చేరే విధంగా చేశామని తెలిపారు. గ్రామ పరిధిలో సచివాలయాలు విలేజ్ క్లినిక్‌ను రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం యావత్ భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా గ్రామ పరిధిలో వైద్యానికి, విద్యార్థులకు, వ్యవసాయ రైతులకు కావలసిన సదుపాయాలు అందాలనే సదుద్దేశంతో గ్రామ పరిధిలో ఉన్న సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అయ్యే విధంగా చేసిన ఘనత సిఎం జగన్‌దేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నల్లారి తిమ్మారెడ్డి, మండల కన్వీనర్ రమేష్ రెడ్డి, ఎంపిడిఒరామకృష్ణ, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, జడ్‌పిటిసి పద్మజ లోకవర్ధన్, నాయకులు శివాజీ రామచంద్ర,ముస్లిం మైనార్టీ యువ నాయకులు వేంపల్లి ఫయాజ్, హనీఫ్, రూతు పాల్గొన్నారు.



నిమ్మనపల్లె :మహిళలకు ఆసరా చెక్కును అందిస్తున్న నిస్సార్ అహ్మద్

విభిన్నప్రతిభావంతులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి



డిటి తపస్వినికి వినతి పత్రం అందిస్తున్న విభిన్నప్రతిభావంతులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని వికలాంగులకు ఇంటి స్థలాలను మంజూరు చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు రెడ్డినారాయణ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ తపస్వినికి విభిన్న ప్రతిభావవంతులు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో వివిధ రకాల అంగవికలత్వం, బధిరం, అంధత్వం, బుద్ధి మాంద్యం కలిగిన విభిన్న ప్రతిభావంతులు జీవిస్తున్నారని అన్నారు. విభిన్న ప్రతిభావంతులకు ఇంటి స్థలాలను కేటాయించాలని గతంలోనే అప్పటి తహశీల్దార్ మంజులకు విన్నవించగా, వికలాంగులకు తప్పకుండా స్థలాలను ప్రత్యేకంగా కేటాయిస్తామని హామీ ని ఇచ్చారని చెప్పారు. ఇక్కడ పనిచేస్తున్న తహశీల్దార్ మంజుల ఉద్యోగ విరమణ పొందారని, మరోసారి ప్రస్తుత తహశీల్దార్ బాలాజీరాజుకు విన్నవించినట్లు తెలిపారు. వికలాంగులకు ప్రత్యేకంగా ఇంటి స్థలాలను కేటాయించి తమకు న్యాయం చేయాలని డిటికివినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో వికలాంగులు శ్రీనివాసులు, వెంకటరమణ, రవితేజ, మంజునాథ్, వెంకటరమణారెడ్డి, రాజన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జామీయా మసీదు హజరత్ మాలిక్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి చొరవతో కురబలకోట జామియా మసీద్ హజరత్ మాలిక్ ఇటీవల కురబలకోట,పెద్దమండ్యం,తంబళ్లపల్లి మండలాలకు ఖాజీగా నియమితులయ్యారు. సోమవారం ఆయన కురబలకోట జడ్‌పిటిసి జ్యోతి బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, కో -ఆప్షన్ యాసాన్‌వలి, మండల ఉపాధ్యక్షులు ముస్తాక్, కన్వీనర్ హసన్, వైసిపి నాయకులు రవీంద్రారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి,కిషోర్‌రెడ్డి, అబ్దుల్, బాలు, ముస్లిం మైనార్టీలతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హజరత్ మాలిక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మూడు మండలాలకు ఖాజీగా నియమించడం ఆనందంగా ఉందన్నారు.మసీదుల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని చెప్పారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. త్వరలో జరిగే ఎన్నికలో వైసిపికి అండగా ఉంటామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు.



ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డితో హజరత్ మాలిక్

ఆదర్శ పాఠశాలలో డిఇఒ ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలను సోమవారం డిఇఒ శివప్రకాష్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8, 9 తరగతి విద్యార్థులు రాస్తున్న సిబిఎస్‌సి పరీక్షలను పరిశీలించినట్లు తెలిపారు. పాఠశాలకు అనుబంధంగా ఉన్నటువంటి బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఇంటర్ పరీక్షలు జరుగుతున్న వేళ బాలికల వసతి గృహంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్న సందర్భంలో డిఇఒ ఇంటర్ విద్యార్థులతో పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒలు చక్రధర్‌రాజు, నాగ తిరుమలరావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ లీల శ్రీహరి, బాలికల వసతి గృహ వార్డెన్ సుమతి, ఎంఐఎస్ శివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టిడిపి ఇన్‌ఛార్జి 'ముక్కా'తో 'కస్తూరి' భేటీ

ప్రజాశకి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జిగా నియమితులైన ముక్కా రూపానందరెడ్డిని కస్తూరి విశ్వనాథ నాయుడుతో సోమవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రూపానంద రెడ్డి టిడిపి ఇన్‌ఛార్జిగా నియమితులైన అనంతరం మొదటిసారి నియోజకవర్గానికి విచ్చేసిన సందర్భంగా టిడిపి కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. టిడిపి సీనియర్ నాయకులు పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, మాజీ సర్పంచి గడికోట సుబ్బరాయుడు, పార్టీ కార్యకర్తలతో కలిసి రాబోయే ఎన్నికలలో టిడిపి విజయం సాధించే దుకు అందరం కలిసి పని చేసే విధంగా కార్యాచరణ రూపొందిం చుకుం టామని రూపానంద రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సురేంద్ర నాయుడు,శ్రీధర్ నాయుడు,మాజీ సర్పంచి ముక్కర శంకరయ్య నాయుడు,పాల్గొన్నారు.

బస్ షెల్టర్‌కు భూమిపూజ

పుల్లంపేట : మండల కేంద్రంలోని కడప-చెన్నై బైపాస్ రోడ్డులోని వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం దగ్గర సోమవారం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, వైసిపి సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, ఎంపిపి ఆధ్వర్యంలో నూతన బస్సుషెల్టర్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధే తమ ధ్యేయమని, తాము మండల అభివృద్ధి నిరంతరం శ్రమించడానికి సిద్ధమని తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని రెండవసారి సిఎం కుర్చీలో కూర్చోపెట్టడమే తమ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకే పాటి శ్రీనివాసులరెడ్డి, దలవాయిపల్లి మాజీ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, యువ నాయకుడు రంజిత్‌రెడ్డి, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో కేంద్ర బలగాల కవాతు

నిమ్మనపల్లి : రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓటర్లు ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవడానికి కేంద్ర సాయుధ బలగాలతో కలసి సోమవారం కవాతు నిర్వహించినట్లు స్థానిక ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి భద్రతలను పరిరక్షించడానికి పోలీసులు పటిష్ట చర్యలను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో వారు ఓటు హక్కును వినియోగించుకోవడానికి భద్రతను, భరోసాను కల్పిస్తామనేందుకు స్థానిక పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీస్ స్టేషన్ నుంచి వెంకోజిగారి పల్లి, నిమ్మనపల్లి, పాత బస్టాండు, కందూరు రోడ్డు మీదుగా పెద్దమాదిగపల్లి వరకు కవాతు నిర్వహించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికలను పటిష్టంగా నిర్వహించడానికి అన్ని చర్యలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ శివరామకృష్ణయ్య, పోలీస్ సిబ్బంది శివ, రెడ్డిబాషా పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు పోటెత్తిన యాత్రికులు

లక్కిరెడ్డిపల్లి : మండల పరిధిలోని అనంతపురం గంగమ్మ జాతర వైభవంగా జరగడం హర్షనీయని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గంగమ్మతల్లి జాతర సందర్భంగా ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి నాయకులుతో కలసి పత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయానికి విచ్చేసిన నేతలకు ఆలయ కమిటీ, ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. జాతర విజయ వంతానికి కృషి చేస్తున్న ఆలయ కమిటీ, దాతలు, అధికారులు, స్వచ్ఛంద సేవా సంఘాలు,స్థానిక గ్రామాల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

పేరు మార్పు

అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం కొట్టాలపల్లి గ్రామం, పిన్ 516107, డోర్ నెంబర్ 3/40 కాపురస్తులైన యద్దలపల్లి పెంచలయ్య భార్యనైన యద్దలపల్లి వసంతకుమారి అను నేను ఈ దినం నుండి యద్దలపల్లి వసంత భర్త యద్దలపల్లి పెంచలయ్యగా మార్చుకొన్నాను.



పోషకాహారంపై తల్లులకు అవగాహన కల్పిస్తున్న అరుంధతి

పోషకాహారంతోనే మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి-కలికిరి

పోషకాహారంతోనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుంధతి తెలిపారు. వాల్మీకిపురం ఐసిడిఎస్ పరిధిలోని కలికిరి మండలం ఇందిరమ్మ కాలనీ అంగన్వాడి కేంద్రం నందు పోషణ పక్షోత్సవంలో భాగంగా మూడవరోజు సోమవారం పోషణ మేళ నిర్వహించారు. ఈ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని 9 నుంచి 23వరకు జరుగుతుందని, ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్ర పరిధిలో రోజువారి కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఇందిరమ్మ కాలనీ అంగన్వాడీ కేంద్రం పరిధిలోని తల్లులు ,అంగన్వాడీ సిబ్బందిచే పోషకాహారం ఎలా తయారు చేయడం, స్థానికంగా దొరికే తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషణ విలువలు ఉన్న ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యం బాగుం టుందని అన్నారు. పౌష్టికాహారంపై ప్రతి అంగన్వాడీ కేంద్రంలోనూ తల్లులకు అవగాహన కల్పించడానికి 23వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిం చనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు హాజరు అయ్యారు.

పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని కెఎంపల్లి గ్రామంలో సొంత నిధులతో నిర్మించిన గంగమ్మ గుడికి ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎంపిపి విజయభాస్కర్ రెడ్డి, వైసిపి రాజంపేట యువ నాయకుడు విజయ సాగర్ రెడ్డిలు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత నిధులతో నిర్మించిన గంగమ్మగుడికి ఆనవాయితీగా ప్రతి సంవత్సరం పట్టు వస్త్రాలు సమర్పించడం జరుగుతుందన్నారు. గ్రామ ప్రజలు డప్పు మేళా తాళాలతో వచ్చి పట్టు వస్త్రాలను తీసుకెళ్లారు. కార్యక్రమంలో కేయంపల్లి నాగార్జున, సోమయ్య, ఉపేంద్ర, రమణ, భాస్కర్, వాలంటర్ రాణి మూగన్న, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-రామాపురం

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరాల సంబంధించి 6వ తరగతి, మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఈనెల 12 నుంచి ఏప్రిల్ 11 తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ పుష్పలత తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 6 వతరగతి మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ తో పాటు 7వ తరగతిలో 10 సీట్లు, 8వ తరగతిలో 3 సీట్లు ఖాళీ ఉన్నాయని తెలిపారు. వీటికి కూడా ఈనెల పది నుంచి ఏప్రిల్ 10 వరకు ఆన్‌లైన్లఓ దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో సిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కోర్సులు ఉంటాయని వాటికి సంబంధించి అర్హులైన బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథలు, బడిబయట ఉన్న చిన్నారులు, పేద ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, దరిద్రరేఖకు దిగువ జీవిస్తున్న బాలికలు మాత్రమే ప్రవేశాలకు అర్హులని తెలిపారు. దరఖా చేయు విద్యార్థులు కులం, ఆదాయం, గ్రామీణ ప్రాంతాల్లో రూ1.20లక్షలుఉ, పట్టణ ప్రాంతాల్లో రూ.1.40లక్షలు ఉండే విధంగా తహశీల్దార్ ధ్రువపత్రాలను జతపరచాలన్నారు. ఈ అవకాశాన్ని బాలికల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆరవ తరగతి ప్రవేశానికి..

తంబళ్లపల్లి : ఎపి ఆదర్శ పాఠశాల తంబళ్లపల్లె ఆరవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎన్.హేమంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశం పొందగోరే విద్యార్థులు ఒసి, బిసిలు రూ.150, ఎస్‌సి, ఎస్‌టిలు రూ.75లు చెల్లించి ఈనెల 31లోపు www.cse.ap.gov.in లేదా apms.ap. gov.in సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశములు ప్రవేశ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం జరుగుతాయని అన్నారు. ఏప్రిల్ 21న ఆదివారం పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించబడునని తెలిపారు. ఇతర వివరాల కోసం పాఠశాలను సందర్శించాలని తెలిపారు.

విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని బాలపల్లి వద్ద నూతనంగా నిర్మిం చిన 33/11 కెవి విద్యుత్ ఉపకేం ద్రాన్ని విద్యుత్ శాఖ మంత్రిపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజం పేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, సిఎం సలహా దారులు రక్కాసి ధనుంజయ రెడ్డి, ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అజయ్‌రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవ సాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెం బర్ హేమనవర్మ, చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డిలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్



స్వాధీనం చేసుకున్న దుంగలతో నిందితుడి అరెస్టును చూపుతున్న అటవీశాఖ అధికారులు

ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

అక్రమంగా తరలిస్తున్న ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు కోడూరు రేంజ్ ఎఫ్ఆర్ఒ వై.రఘునాథరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబడిన సమాచారం మేరకు కోడూరు రేంజి పరిధిలోని గాదెల బీటు శేషాచల అటవీ ప్రాంతంలో దాడులు చేశామని తెలిపారు. ఈ దాడుల్లో తమిళనాడుకు చెందిన వెంకటేశన్ అనే స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్ఒ మహేష్‌కుమార్, ఎఫ్‌బిఒలు దేవేంద్రరెడ్డి, నాగేశ్వర్‌నాయక్ పాల్గొన్నారు.

నలుగురు మోటారు వైర్ల దొంగలు అరెస్టు

ప్రజాశక్తి-పుల్లంపేట

మోటారు వైర్‌లను దొంగిలించిఏ నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు. మండల పరిధిలోని రంగంపల్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డి ధర్మారెడ్డి తన పొలంలో షెడ్‌లో ఉన్న కేబుల్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి దొంగలించారని ఫిర్యాదు చేశారని తెలిపారు. వెంటనే స్పందించిన రాజంపేట డిఎస్‌పి విఎన్‌కె చైతన్య, రాజంపేట రూరల్ సిఐ మంజునాథరెడ్డి ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి రెడ్డిపల్లె చెరువు కట్ట సమీపంలోని బస్టాప్ వద్ద నలుగురు వైరు దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో రెడ్డిపల్లి మజార జానకిపురం గ్రామానికి చెందిన రాముడు, సిద్దేశ్వర, హరి ప్రసాద్, పెంచలయ్య అనే నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి మోటార్ కేబుల్ వైర్ నుండి కరిగించిన 2.550 కేజీల కాపర్ వైరును, రామప్ప పల్లి గ్రామానికి చెందిన పోతినేని భరత్ పొలంలో దొంగిలించిన 600 గ్రాముల కాపరు వైరు మొత్తం 3.150 కేజీల కాపర్ వైర్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాముడు, పెంచలయ్యలను రిమాండ్ నిమిత్తం నందలూరు జెఎఫ్‌సిఎం కోర్టుకు, సిద్దేశ్వర, హరి ప్రసాద్‌లను జువైనల్ జస్టిస్ కోర్టు కడపకు తరలించినట్లు తెలిపారు.